

లినెన్.. మది దోచెన్

చేనేతను ప్రోత్సహించేందుకు ఇటీవల జాతీయ స్థాయిలో విరాసత్ ప్రదర్శన నిర్వహించారు. అందులో దుబ్బాక లినెన్ చీరను ప్రదర్శించారు. 18లో..



బావను చంపిన బావమరిది

అప్పుగా తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వలేదనే కారణంతో మద్యం మత్తులో సొంత బావను దారుణంగా హత్య చేశాడు. 18లో..



మేలైన పద్ధతులతో దిగుబడి

పొద్దుతిరుగుడు సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్త శ్వేత అన్నారు. 18లో..

న్యూస్‌రీల్

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమలు



సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని సీపీ ఎన్.శ్వేత బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ యాక్ట్ ఫిబ్రవరి 9వ తేదీ ఉదయం 6 గంటల వరకు అమల్లో ఉంటుందన్నారు. ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. అదే విధంగా ఫిబ్రవరి 09వ తేదీ వరకు డీజే సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కొనసాగుతాయన్నారు.

రేపు కూడవెల్లికి గోదావరి జలాల విడుదల

ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్: గజ్వేల్ మండలం కొడకండ్ల వద్ద మల్లన్నసాగర్ కాల్వ నుంచి కూడవెల్లి వాగులోకి 3వ తేదీన గోదావరి జలాలను విడుదల చేయనున్నట్లు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్‌లోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూడవెల్లి వాగు ఆయకట్టుకు వేసవిలో పంటలకు సాగునీటి సమస్య రాకుండా చూసేందుకు ఈ నీటి విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

రిమ్మనగూడను సందర్శించిన ఎఫ్‌ఎల్‌ఎన్ పీడీ



రికార్డులను పరిశీలిస్తున్న సువర్ణవినాయక్

గజ్వేల్: గజ్వేల్ మండలం రిమ్మనగూడ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎఫ్‌ఎల్‌ఎన్ (ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ) రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ సువర్ణవినాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన లైబ్రరీని పరిశీలించారు. బోధన తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆ తర్వాత రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ తీరుపై ఈ సందర్భంగా ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గోపీకళ, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు భద్రమ్మ, వేణు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి పరీక్షలు



సీపీ శ్వేతతో వైద్య సిబ్బంది

సిద్దిపేటకమాన్: కంటి వెలుగు రెండో విడత కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహించిన శిబిరంలో 530 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి పరీక్షలు నిర్వహించి 118 మందికి అద్దాలు పంపిణీ చేసినట్లు సీపీ శ్వేత బుధవారం తెలిపారు. విధులు నిర్వహించిన వైద్యులు, సిబ్బందిని సీపీ అభినందించారు. అలాగే జిల్లాలో 47 వైద్య బృందాల ద్వారా ఇప్పటివరకు 63,457 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

ముగిసిన జేఈఈ మెయిన్స్



హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

సిద్దిపేటఅర్బన్: ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజులుగా జరుగుతున్న జేఈఈ మెయిన్స్ బుధవారంతో ముగిశాయి. చివరి రోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 69 మంది విద్యార్థులకు గాను 68 మంది హాజరయ్యారు. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించినట్టు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ వీపీ రాజు తెలిపారు. అబ్జర్వర్లు విజయ్ కుమార్, టీసీఎస్ ఆఫీసర్ మహేశబాబు, డీపీ రావు, పీఆర్వో రఘు, సిస్టం అడ్మిన్ షాదుల్లా పర్యవేక్షించారు.

బడి మెరిసె.. విద్యార్థులు మురిసె

మన ఊరు - మన బడితో మారిన రూపురేఖలు

- ఒకే రోజు 24 పాఠశాలలు ప్రారంభం
- హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



మిరుదొడ్డి పాఠశాలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్





దుద్దెడ పాఠశాలను ప్రారంభించిన అనంతరం విద్యార్థులతో కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు, ఆనందంలో కేరింతలు కొడుతున్న విద్యార్థులు

సాక్షి, సిద్దిపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘మన ఊరు – మన బడి’ కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు మెరిసిపోతున్నాయి. కొత్త బెంచీలు, బోర్డులు, అందమైన రంగుల్లో గోడలు, డైనింగ్ హాల్స్ తాగునీటి వసతి, మరుగుదొడ్లు ఇలా సకల వసతులను చూసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. మరమ్మతులు, వసతుల కల్పన పూర్తయిన 24 ప్రభుత్వ పాఠశాలలను బుధవారం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

కార్పొరేట్ తరహా విద్య అందించేందుకే..

దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి, మిరుదొడ్డి బాలుర పాఠశాలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజా శర్మ, ఎమ్మెల్సీ ఫారుక్‌హుస్సేన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నిరుపేద విద్యార్థికి కార్పొరేట్ తరహా విద్యను అందించేందుకు సీఎం కేసీఆర్ మన ఊరు –మన బడి పథకాన్ని తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితో విజయవంతంగా ముందుకు సాగుతుందన్నారు. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో పదో తరగతి విద్యార్థులకు కేసీఆర్ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నారన్నారు.

బంగారు భవితకు బాటలు వేయాలి

కొండపాక మండలం దుద్దెడ, వర్గల్‌లోని పాఠశాలలను కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్.. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఇంత గొప్ప కార్యక్రమాన్ని విజయవంతం చేయగలిగామన్నారు. విద్యార్థులు బంగారు బాట వేసుకునేలా వారిని తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే అక్బర్‌పేట - భూంపల్లి మండలంలోని రుద్రారం పాఠశాలను దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు, అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, హుస్నాబాద్‌లో కూచనపల్లి పాఠశాలను ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్ ప్రారంభించారు.

ఇంటిని మరిచేలా స్కూల్



మా స్కూల్‌ను చాలా అందంగా తీర్చిదిద్దారు. గతంలో బెంచీలు లేక కిందనే కూర్చునేవాళ్లం. ఇప్పుడు డ్యూయల్ డెస్కులు ఏర్పాటు చేశారు. ప్రత్యే టాయిలెట్లు నిర్మించారు. గ్రీన్ చాక్ బోర్డులు ఏర్పాటు చేశారు. పరిశుభ్రమైన తాగు నీరు కల్పించారు. ఇంటిని మరిచే విధంగా పాఠశాలకు రంగులు వేశారు. ఇక చదువుకోవడమే మా వంతు.

– తేజశ్రీ , ఐదో తరగతి విద్యార్థిని, హుస్నాబాద్

కార్పొరేట్ స్థాయిలో వసతులు



మన ఊరు - మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలలో చాలా మార్పులు వచ్చాయి. కార్పొరేట్ స్థాయిలో ఇప్పుడు వసతులు సమకూరాయి. మా పాఠశాలను చూస్తే ఇప్పుడు చదుకోవాలనే ఆలోచన కలిగే విధంగా తయారు చేశారు. టాయిలెట్లు, కిచెన్ షెడ్స్ ఇలా సకల సౌకర్యాలు కల్పించారు.

– అనురాధ, ఉపాధ్యాయురాలు, హుస్నాబాద్

ఆపరేషన్ స్మైల్‌తో 60 మంది పిల్లల గుర్తింపు

- కౌన్సెలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగింత
- జిల్లా నోడల్ అధికారి, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్



మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్

సిద్దిపేటకమాన్: జిల్లాలో నెల రోజులుగా నిర్వహించిన ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా 60 మంది పిల్లలను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఆపరేషన్ స్మైల్ జిల్లా నోడల్ అధికారి, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. జనవరి 01 నుంచి 31 వరకు ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలతో పనిచేయిస్తున్న 08 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే 165 హాట్‌స్పాట్‌లను గుర్తించి ప్రత్యేక నిఘా పెట్టి 60 మంది పిల్లలను రెస్క్యూ చేసి సీడబ్ల్యూసీ ముందు హాజరుపరచమన్నారు. బాల కార్మికులతో పని చేయిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే డయల్ 100, సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ 8333998699కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆపరేషన్ స్మైల్‌లో సిద్దిపేట డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది బాగా పని చేసినందుకు ప్రత్యేకంగా అభినందించారు.

సులభంగా అర్థమయ్యేలా పుస్తకాలు

అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

కొండపాక(గజ్వేల్): సులభంగా పాఠాలు అర్థమయ్యేలా బుక్స్‌ను సొంతంగా అందజేస్తామని అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ తెలిపారు. మండల పరిధిలోని దుద్దెడ ప్రాథమిక పాఠశాలలో బుధవారం గ్రంథాలయాన్ని సర్పంచ్ ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కాసేపు విద్యార్థులతో ముచ్చటించి పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో ఉత్తమ ఫలితాలను సాధించడానికి దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. తన నమ్మకాన్ని వమ్ము కాకుండా చూడాలని విద్యార్థులను కోరారు. ప్రతీ రోజు చదువుతో పాటు గ్రంథాలయంలో పుస్తకాలను చదవాలన్నారు. కార్యక్రమంలో రైతుబంధు మండల కోఆర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య, ఉపాధ్యాయులు, పంచాయితీ కార్యదర్శి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయం లాభసాటిగా మారాలి



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతులు వ్యవసాయ శాఖ సేవలను వినియోగించుకుంటే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని వ్యవసాయశాఖ జిల్లా అధికారి శివప్రసాద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కస్తూరిపల్లిలో శాస్త్రవేత్తలు రఘురాం, ఆర్‌జీ వర్మ, కిరణ్ బాబు, శ్రీదేవి, విజయ్ కుమార్‌తో కలిసి వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారుల సేవలను వినియోగించుకుని అధిక దిగుబడి సాధించాలన్నారు. ప్రస్తుతం వరి సాగుకు వస్తున్న చీడపీడల నుంచి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యాసంగిలో వరిలో గొట్టం, మొగి పురుగు, కాండం తొలిచే పురుగు ఉధృతి అధికంగా ఉందన్నారు. ఇవి పంటను ఎదగకుండా నష్టం కలిగిస్తున్నాయన్నారు. చీడపీడల నివారణకు తగు సూచనలు, జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి జయంత్ కుమార్, ఏఈఓ ప్రశాంత్, సర్పంచ్ పద్మ స్వామి, రైతులు పాల్గొన్నారు.

అండర్–14 క్రికెట్‌లో సెంచరీ చేసిన గజ్వేల్ క్రీడాకారుడు



హిషాంత్

గజ్వేల్‌రూరల్: కేరళలో అండర్–14 విభాగంలో కృష్ణమూర్తి స్మారక సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంట్‌లో గజ్వేల్ పట్టణానికి చెందిన క్రీడాకారుడు బి. హిషాంత్ ఆడుతున్నాడు. అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించి సెంచరీ చేసి నాటౌట్‌గా నిలవడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2డే లీగ్ మ్యాచ్‌లో భాగంగా మొదటి రోజు బుధవారం పాండిచ్చేరి–హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌సీఏ ఆధ్వర్యంలో హైదరాబాద్ జట్టు నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న హిషాంత్ 142 బాల్స్ ఆడి 101 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా గజ్వేల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిశ్చంద్రప్రసాద్‌తో పాటు క్రీడాభిమానులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

హాఫ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ

హుస్నాబాద్: హుస్నాబాద్ రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 12వ తేదీన పట్టణంలో నిర్వహించే హాఫ్ మారథాన్ రన్నింగ్ పోస్టర్‌ను బుధవారం ఏసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే సతీశ్ కుమార్ ఆవిష్కరించారు. అక్కన్నపేట రోడ్డులోని ఏనే వద్ద 5కే, 10కే, 21కే(హాఫ్ మారథాన్) 3వ ఎడిషన్ పోటీలు నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసక్తి గల యువతీయువకులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విజేతలుగా నిలిచిన వారికి నగదు పురస్కారం అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ సతీష్, సీఐ కిరణ్, ఎస్సైలు శ్రీధర్, వివేక్, వెంకట్, రమేష్, సంపత్, మహేందర్, శ్రీనివాస్, తిరుపతి, వెంకటనర్సయ్య ఉన్నారు.

ఆస్పత్రి వద్ద పోలీస్ అవుట్‌పోస్ట్



అవుట్ పోస్టులో రికార్డులను పరిశీలిస్తున్న విమలాథామస్, ఏసీపీ దేవారెడ్డి

సిద్దిపేటకమాన్: ఆస్పత్రికి వచ్చే ప్రజలు, ఆస్పత్రి భద్రతకు ఇబ్బందులు లేకుండా ఉండేలా సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేశారు. బుధవారం మెడికల్ కళాశాల డైరెక్టర్ వివలాథామస్, ఏసీపీ దేవారెడ్డి ఈ అవుట్‌పోస్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు ఆదేశానుసారం, సీపీ సూచనల మేరకు ఏర్పాటు చేశామన్నారు. ఈ అవుట్‌పోస్ట్‌లో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఇద్దరు కానిస్టేబుళ్లు 24 గంటలు విధులు నిర్వహిస్తారన్నారు. ఆస్పత్రికి వచ్చేవారికి ఏవైనా సమస్యలు ఉంటే పోలీస్ అవుట్‌పోస్టులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ చందర్, ఆర్‌ఎంఓలు డాక్టర్ హేమలత, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సదానందం, కౌన్సిలర్ సాయి, వన్ టౌన్ ఎస్ఐ నాగేశ్వర్‌రావు, ఎస్ఐ స్రవంతి, పోలీసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉపాధి హామీ’కి కోత



- తనఖాలేని రుణ పరిమితి పెంపు
- ప్రత్యేక పథకంతో మత్స్య కార్మికుల అభివృద్ధి
- కేంద్ర వద్దుపై పెదవి విరుస్తున్న ప్రతిపక్షాలు



సాక్షి, సిద్దిపేట: కేంద్ర ప్రభుత్వం బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై మిశ్రమ స్పందన కనిపిస్తోంది. ఉపాధి హామీ పథకానికి, గ్రామీణాభివృద్ధి శాఖకు కేటాయించే నిధుల్లో 13 శాతం కోత విధించారు. దీంతో జిల్లాలో ఉపాధి పనులు తగ్గనున్నాయి. మొత్తం 499 పంచాయతీల్లో 2,11,653 జాబ్ కార్డులుండగా 4,42,105 మంది కూలీలు ఉన్నారు. జిల్లాలోని సుమారు 5లక్షల మంది వేతన జీవులకు శుభవార్త చెప్పింది. వారికి ఊరటనిస్తూ రూ.5 లక్షలుగా ఉన్న ఆదాయపన్ను పరిమితిని రూ.7 లక్షలకు పెంచారు. అలాగే తనఖా లేని రుణపరిమితిని రూ.లక్ష నుంచి రూ.1.6 లక్షలకు పెంచారు. దీంతో వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధి చెందనుంది. జిల్లా వ్యాప్తంగా 3.10 లక్షల ఎకరాల్లో 1,62,094 మంది రైతులు సాగుచేస్తున్నారు.

సహకార సంఘాల కంప్యూటరీకరణ

మత్స్యకారుల అభివృద్ధికి ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన అనే కొత్త పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించారు. అందుకోసం రూ.6 వేల కోట్లను కేంద్ర బడ్జెట్‌లో కేటాయించారు. దీంతో జిల్లాకు చెందిన 281 మత్స్య సహకార సంఘాల్లోని 20,350 మంది సభ్యులకు లబ్ధి చేకూరనుంది. అలాగే ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలను కంప్యూటరీకరణ చేసేందుకు దేశవ్యాప్తంగా రూ.2,516 కోట్లను కేటాయించారు. పీఏసీఎస్‌లు పూర్తి స్థాయిలో కంప్యూటరీకరణ చేయనుండటంతో అక్రమాలకు చెక్ పడనుంది. జిల్లాలో 21 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో 1,88,215 మంది సభ్యులున్నారు.


పేదలకు శాపం..



ఈ బడ్జెట్ దేశంలో అసమానతలు పెంచేలా ఉంది. ఇది పూర్తిగా పేదల వ్యతిరేక బడ్జెట్ - సంపన్నుల అనుకూల బడ్జెట్. ఉపాధి హామీకి రెండేళ్ల క్రితం రూ.98 వేల కోట్లు కేటాయిస్తే ఇప్పుడు కేవలం రూ.60వేల కోట్లు మాత్రమే కేటాయించడం సిగ్గు చేటు. మైనార్టీ లకు ఇచ్చే రాయితీ కేవలం రూ.600 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణం.

– మంద పవన్, సీపీఐ జిల్లా కార్యదర్శి


ఇది కార్పొరేట్ అనుకూల బడ్జెట్



ఇది కార్పొరేట్ అనుకూల బడ్జెట్. అదానీ, అంబానీ, గుజరాత్ ప్రయోజనాలను కాపాడేలా ఉంది. సామాన్య ప్రజానికాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ఈ బడ్జెట్ పూర్తిగా నిరుత్సాహ పరిచింది. పబ్లిక్ ఆస్తులను 12 నుంచి 15 కంపెనీలకు అమ్ముకోవడం ద్వారా దేశాన్ని దివాలా తీయించడంలో బీజేపీ బిజీగా ఉంది. తక్కిన ప్రజలు పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అవినీతితో అలమటిస్తున్నారు. అలాంటప్పుడు ఆత్మనిర్భర్ భారత్‌కు అర్థమే లేదు.

– అత్తు ఇమామ్, సిద్దిపేట కాంగ్రెస్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు


రాష్ట్రానికి ప్రయోజనం శూన్యం



ఈ బడ్జెట్ లో మరోసారి బడా వ్యాపార వ్యవస్థలపై ఉన్న ప్రేమను బయట పెట్టారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, చిరు వ్యాపారస్తులకు ఉద్యోగులకు ఎటువంటి ఉపయోగం లేదు. కేవలం పన్ను చెల్లింపు కొత్త విధానంలో ఆదాయపు పన్ను మినహాయింపును పెంచారు. గొప్ప విప్లవత్మక మార్పులు చేర్పులు ఏమీ లేవు. ఈ బడ్జెట్‌తో తెలంగాణకు ఎటువంటి ప్రయోజనం లేదు.

– సూర్యదేవర క్రాంతికుమార్, చార్టెడ్ అకౌంటెంట్

ముందుచూపు ప్రణాళిక..



అగ్రరాజ్యంగా ఎదగడానికి ముందు చూపుతో తీసుకున్న ప్రణాళిక ఇది. దానిలో కొన్ని నష్టాలు జరగవచ్చు. కానీ మనకు లాభమే చేరుకుతుంది. మోదీ ఆలోచన విధానం అగ్రరాజ్యాలు గుర్తించాయి. రానున్న రోజుల్లో భారత దేశం అగ్రరాజ్యాల సరసన చేరుతుంది. ఆదాయపన్ను రూ.7లక్షల వరకు మినహాయింపుతో కొంత మందికి వెసులుబాటు దొరకుతుంది.

– డాక్టర్ వల్లకోటి దేవేందర్, సీనియర్ హోమియోపతి వైద్యుడు

లినెన్.. మది దోచెన్

విరాసత్ జాతీయ ప్రదర్శనలో దుబ్బాక చీర

తాటి జాన్‌రెడ్డి, సిద్దిపేట డెస్క్...


దుబ్బాకలో సినీ నటి సమంత (ఫైల్)

'చుట్టూ చెంగావి చీర కట్టావే చిలకమ్మా.. ఆశపడే కన్నులలో ఊసులాడే వెన్నెల బొమ్మా..' అంటూ చీరకట్టులోని కనికట్టును వర్ణించాడు ఓ సినీకవి. భారతీయ సంప్రదాయానికి తొలిమెట్టుగా.. మన సంస్కృతికి జీవనాడిగా.. ప్రపంచం చేతులెత్తి నమస్కరించే అరుదైన గొప్పతనం చీరకట్టుకే ఉందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. దేశంలో భాషలెన్ని ఉన్నా.. వేషధారణలో చీరకట్టు ఒక్కటే మన సంస్కృతి ఐక్యతకు చిహ్నం. చేనేత చీర.. భారతీయ సాంస్కృతిక వారసత్వానికి చిరునామాగా మారింది. ఫ్యాషన్ ప్రపంచం కొత్త పుంతలు తొక్కుతున్నా.. అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంటూనే చేనేత చీర సజీవంగా నిలబడింది. సిద్దిపేట జిల్లా దుబ్బాకలో నేసిన చీరకు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చిన నేపథ్యంలో ప్రత్యేక కథనం.

మనదేశంలో కంటే విదేశాల్లోనే లినెన్ ఉత్పత్తుల వాడకం ఎక్కువగా ఉంది. అయితే ఇండియాలో చాలాచోట్ల లినెన్‌లో విస్కో, కాటన్ మిక్స్, రెమీ యారన్, పాలిస్టర్ మిక్స్, యార్లల్ మిక్స్ ఎక్కువగా ఉంటోంది. ఇదంతా చైనా నుంచే దిగుమతి అవుతోంది. క్వాలిటీ లినెన్ ఇటలీ, యూకే, ఫ్రాన్స్, బెల్జియం నుంచి ఇండియాకు వస్తోంది.

విరాసత్ ప్రదర్శనకు ఇలా...

చీరల పండగ పేరిట ఢిల్లీలో జరిగిన మొదటి విరాసత్ ప్రదర్శన విషయం శ్రీనివాస్‌కు తెలిసింది. దీంతో వీవర్స్ సర్వీస్ సెంటర్ నార్త్‌జోన్ ఇన్‌చార్జ్ నౌటియాల్‌కు ఫోన్ చేశాడు. ఆయన హైదరాబాద్‌లో పనిచేసిన సమయంలో శ్రీనివాస్‌కు పాత పరిచయం ఉంది. తాను తయారు చేస్తున్న లినెన్ చీరలు, వాటి నాణ్యత గురించి నౌటియాల్‌కు చెప్పారు. దీంతో రెండో విరాసత్ ప్రదర్శనలో శ్రీనివాస్ లినెన్ చీరకు అవకాశం లభించింది.

సమంత స్ఫూర్తితో...

తెలంగాణ చేనేత బ్రాండ్ అంబాసిడర్ హోదాలో సినీనటి సమంత 2017లో దుబ్బాకకు వచ్చారు. పట్టణంలోని చేనేత కార్మికులను కలిశారు. వారు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. దుబ్బాక హ్యాండ్లూమ్స్ వీవర్స్ సొసైటీ చైర్మన్ బోడ శ్రీనివాస్ ఆమె వెంట ఉన్నారు. బాగల్‌పూర్ నుంచి తీసుకొచ్చిన చేనేత చీరను శ్రీనివాస్‌కు ఇచ్చి ఇలాంటివి ఇక్కడ తయారు చేస్తారా? అని అడిగారు. సాదారకంలో ఉన్న బాగల్‌పూర్ చీర 40 టు 44.(కాటన్ కౌంట్) చూపించారు. అప్పుడే శ్రీనివాస్‌కు సాదాతోపాటు, ఇక్కత్‌లోనూ ఇలాంటి చీరలను నేయాలనే ఆలోచన వచ్చింది. గతేడాది సొంతంగా దుబ్బాక హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ ప్రొడ్యూసర్ లిమిటెడ్ కంపెనీకి శ్రీకారం చుట్టారు. 80–80, 100–80 లినెన్ యారన్‌లో సన్నసాదాతో పాటు, ఇక్కత్ చీరలకు శ్రీకారం చుట్టారు. అనేక రకాల డిజైన్లలో ఈ చీరలను నేయిస్తున్నారు.



దుబ్బాక హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈఓ బోడ శ్రీనివాస్ సారథ్యంలో టై అండ్ డై విధానంలో ఇక్కత్‌లో చీరను దుబ్బాకలోనే తయారు చేశారు. దీని తయారీకి పూర్తిగా బెల్జియం లినెన్ 80లీ ఉపయోగించారు. ఈ ప్రత్యేకత కారణంగానే విరాసత్ రెండో ప్రదర్శనకు దుబ్బాక చీర ఎంపికైంది. దేశవ్యాప్తంగా 75 చీరలకు చోటు దక్కగా, అందులో దుబ్బాక చీర ఒకటి. గ్రీన్, పింక్, లైట్‌బ్లూ, ఎల్లో, వైట్ కలర్స్ మిక్స్‌తో ఈ లినెన్‌చీరను నేశారు. ఈ చీర తయారీకి

చీర ప్రత్యేకత..

నాణ్యమైన లినెన్ యారన్ 80లీ ఫైబర్ వాడారు. బాంబే, అహ్మదాబాద్ లాంటి నగరాల్లో ఏసీ ప్లాంట్‌లలో మరమగ్గాలపై లినెన్ ఉత్పత్తులు తయారవుతాయి. అయితే మాములు మగ్గాలపై లెనిన్ ఫైబర్ కట్ కాకుండా ఉండేందుకు సైజింగ్ చేయడానికి దుబ్బాకలో క్వాలిటీ కెమికల్ లిక్విడ్స్ వాడి నైపుణ్యం సాధించారు. వీటిని సూరత్, అహ్మదాబాద్‌ల నుంచి తెప్పించారు. సైజింగ్ కోసం పెద్ద కసరత్తు జరిగింది. చేనేతలో విశేష అనుభవమున్న శ్రీనివాస్ సైజింగ్ విషయంలో మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. దీని కోసం దశాబ్దకాలం కష్టపడ్డారు. ఆ కృషి ఫలితమే ఈ చీర. ఆయా చీరల డిజైన్లను బట్టి ధర రూ.6,800 నుంచి రూ.12,000 వరకు ఉంది.

విరాసత్ అంటే...

చేనేత రంగానికి, చేనేత ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం విరాసత్‌కు శ్రీకారం చుట్టింది. ప్రత్యేకించి చేనేత చీరలకు పెద్దపీట వేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. గత ఏడాది డిసెంబర్ 16వ తేదీన దేశరాజధాని ఢిల్లీలో విరాసత్ పేరిట చేనేత చీరల పండగను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించగా, డిసెంబర్ 30వ తేదీతో ముగిసింది. ఇందులో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 70 చీరలు ప్రదర్శనలో ఉంచారు. వివిధ సామాజిక మాధ్యమాల్లో చేసిన ప్రచారం ద్వారా ఈ కార్యక్రమం ఎంతో విజయవంతమైంది. చేనేతకు చేయూత ఇచ్చేందుకు చేసిన ప్రయత్నాలు సత్ఫలితాలు ఇచ్చాయి. దీంతో 2023 జనవరి 3వ తేదీ నుంచి జనవరి 15వ తేదీ వరకు కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని హ్యాండ్లూమ్ హాట్‌లో రెండో దశ చీరల పండగ నిర్వహించారు. ఇందులో 75 విభిన్నమైన చేనేత చీరలను ప్రదర్శనలో ఉంచారు. రిటైల్ అమ్మకాలతో పాటు మగ్గం ప్రదర్శన, చీరలపై సమావేశాలు, సదస్సులు



కూడా నిర్వహించారు. అంతేకాకుండా భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా జానపద నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

వడ్డీలేని రుణాలు ఇవ్వాలి



చేనేతలో ఉత్పత్తులు తయారు చేసే ప్రొడ్యూసర్ కంపెనీలకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలి. మేము తయారు చేసిన వాటిని టెస్కో కొనుగోలు చేయాలి. కేంద్ర ప్రభుత్వమే ప్రొడ్యూసర్ కంపెనీ రిజిస్ట్రేషన్ ఖర్చు భరించింది. తెలంగాణ వ్యాప్తంగా 26 ప్రొడ్యూసర్ కంపెనీలు ఉండగా, ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా దుబ్బాకలోనే ఉంది. ఇప్పుడిప్పుడే లినెన్ వాడకం పెరుగుతోంది. చేనేతను ప్రోత్సహించేందుకు అందరూ వీటిని ధరిస్తే బాగుంటుంది. మరిన్ని ఆర్డర్లు ఇచ్చేందుకు ఎవరైనా ముందుకొస్తే నాణ్యమైన లినెన్ చీరలు తయారు చేసి ఇస్తాం. చీరలతోపాటు లినెన్ సూటింగ్ అండ్ షర్టింగ్‌తో పాటు టవల్స్ కూడా అందుబాటులో ఉన్నాయి.

– బోడ శ్రీనివాస్

కాకతీయుల కాలం నాటి వీరగల్లు లభ్యం


పోచమ్మ ఆలయం వద్ద లభించిన వీరగల్లు

నంగునూరు(సిద్దిపేట): నంగునూరులోని నల్లపోచమ్మ దేవాలయం వద్ద కాకతీయుల కాలం నాటి ఎక్కటి వీరగల్లు లభించినట్లు చరిత్ర పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ విగ్రహం కుడి చేతిలో బాకు, ఎడమ చేతిలో విల్లు, భుజంపై విల్లంభులు, నడుముకు వీరకాషె, కడియాలు ధరించిన రాతి విగ్రహం లభించిందని, అది కాకతీయుల కాలం నాటిదని తెలుస్తోందన్నారు. అన్ని రకాల ఆయుధాల ప్రయోగించడంతోపాటు ఒంటరిగా పోరాడే వారిని ఎక్కటి యోధులు అని పిలిచేవారని చెప్పారు. కాకతీయుల కాలంలో వీరికి ప్రత్యేక స్థానం కల్పించేవారన్నారు. ఇలాంటి అరుదైన వీరగల్లును కాపాడి చరిత్రను విద్యార్థులకు తెలియజేయాలన్నారు.

మూకదాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ


ఆందోళన చేస్తున్న యుఎస్‌పీసీ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): ఉపాధ్యాయుడిపై మూకదాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం యుఎస్‌పీసీ నాయకులు సంగారెడ్డి డీఈఓ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డిసెంబర్‌లో నిజామాబాద్ జిల్లా కోటగిరి హైస్కూల్లో పనిచేస్తున్న మల్లికార్జున్ టీచర్‌పై మూకదాడికి పాల్పడిన ఆర్‌ఎస్‌ఎస్, బజరంగదళ్ నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ నేడు నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దాడులు భవిష్యత్‌లో జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

క్లుప్తంగా

నీట మునిగి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ


రమేశ్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధి బిజ్లిపూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కుక్కల రమేశ్(50) గ్రామ శివారులో ఉన్న ఫామ్‌హౌస్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అతడి కోసం వెతికారు. గ్రామ శివారులోని వీరప్ప చెరువు కట్టపైన రమేశ్ దుస్తులు కనిపించాయి. బుధవారం ఉదయం చెరువులో గాలించగా మృతదేహం లభ్యమైంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అనసూజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సరైన పద్ధతులతో అధిక దిగుబడి


పొద్దుతిరుగుడులో క్షేత్ర దినోత్సవం

సిద్దిపేటరూరల్: రైతులు పొద్దుతిరుగుడు పంట సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పరిశోధనా స్థానం శాస్త్రవేత్త శ్వేత అన్నారు. బుధవారం మండల పరిధిలోని బుస్సాపూర్ గ్రామంలో 'పొద్దుతిరుగుడు సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం, క్షేత్ర దినోత్సవం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైవిధ్యీకరణలో నూనెగింజల పాత్ర, ప్రత్యామ్నాయ పంటల సాగు విధానం గురించి వివరించారు. వరి మాగాణుల్లో నూనెగింజల పంటల ఉత్పత్తి , సాగు పద్ధతులు తెలిపారు. పొద్దుతిరుగుడులో మేలైన యాజమాన్య పద్ధతులు, ప్రస్తుత కూలీల కొరతను అధిగమించడానికి యాంత్రీకరణ ప్రాముఖ్యత, పూత దశలో బోరాక్స్ 0.2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.సాయినాథ్ మాట్లాడుతూ నూనెగింజల పంటలో సూక్ష్మ పోషకాలు ప్రాధాన్యత, సమగ్ర పోషక యాజమాన్యం వివరాలు తెలిపారు. శాస్త్రవేత్త ఉమారాణి పొద్దుతిరుగుడు, వివిధ నూనెగింజల పంటల విత్తనోత్పత్తి, మెలకువలపై అవగాహన కల్పించారు. రసం పిల్చే పురుగు నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా థయోమిథక్సమ్ 0.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. పంటలో వయ్యారి భామ కలుపు నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో బుస్సాపూర్ సర్పంచి సదాశివరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీ. ప్రేమ్ సాయి పాల్గొన్నారు.

యువతి అనుమానాస్పద మృతి

ఫిర్యాదు చేసిన తండ్రి, కేసు నమోదు


సౌజన్య (ఫైల్)

దుబ్బాకరూరల్: అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందింది. ఈ సంఘటన భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధి చిన్న నిజాంపేట గ్రామంలో జరిగింది. ఏఎస్‌ఐ భిక్యానాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శేర్ల సౌజన్య(18) బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. ఆత్మహత్యపై అనుమానం ఉన్నట్లు యువతి తండ్రి సురేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఎల్లమ్మ దేవాలయంలో చోరీ

నిజాంపేట(మెదక్): రేణుక ఎల్లమ్మ దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని మండల పరిధిలోని కల్వకుంట గ్రామస్తులు తెలిపారు. దేవాలయ ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించిన్నట్లు చెప్పారు. చోరీ విషయంపై పోలీసుల సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


బస్సు చక్రాల కింద వెంకటేశ్ మృతదేహం

జహీరాబాద్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. జహీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి సంగారెడ్డి పట్టణానికి చెందిన వెంకటేశ్ న్యాల్‌కల్ మండలం బంగ్లా మిర్జాపూర్‌లోని తన అమ్మమ్మ ఇంటి నుంచి జహీరాబాద్‌కు బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో బస్సును ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టి బస్సు కింద పడటంతో మరణించాడు. సంఘటనా స్థలానికి ఎస్‌ఐ శ్రీకాంత్ చేరుకుని పంచనామ నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): టీవీఎస్ మోపెడ్ అదుపుతప్పడంతో కిందపడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ సంఘటన కౌడిపల్లి మండలం నాగ్సాన్‌పల్లి హనుమాన్ ఆలయం సమీపంలో 765డి జాతీయ రహదారిపై జరిగింది. బుధవారం కౌడిపల్లి ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా నాగారెడ్డిపేట మండలం రాఘవపల్లి గ్రామానికి చెందిన న్యాలకంటి భూమేశ్ (28) హైదరాబాద్ గండిమైసమ్మ ప్రాంతంలో కూలీ పనులు చేస్తున్నాడు. జనవరి 29వ తేదీన టీవీఎస్‌పై గండిమైసమ్మకు వచ్చాడు. తిరిగి 31న రాత్రి ఇంటికి వెళ్తున్నాడు. నాగ్సాన్‌పల్లి హనుమాన్ ఆలయం సమీప అడవిలో వాహనం అదుపు తప్పడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని ఆటోలో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన దాక్టర్లు అప్పటికే భూమేశ్ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డబుల్ ఇళ్లు కేటాయించడం లేదని..

- గృహప్రవేశ యత్నం
- అడ్డుకొన్న రెవెన్యూ అధికారులు


రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకురాలు బాలమణి

చేగుంట(తూప్రాన్): డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించడం లేదని కొంతమంది గృహప్రవేశ యత్నాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. బుధవారం మండల కేంద్రమైన చేగుంటలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయడం లేదని సీఐటీయూ జిల్లా నాయకురాలు బాలమణి ఆధ్వర్యంలో బుధవారం గ్రామస్తులు వాటిని ఆక్రమించే యత్నం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకుని ఇళ్లను ఆక్రమించకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు బాలమణి మాట్లాడారు. 2018లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారని, పేదలు మూడు పర్యాయాలు దరఖాస్తు చేసుకున్నా ఎందుకు కేటాంచలేదని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. అంతే కాకుండా అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించలేదనే ప్రచారం జరుగుతున్నందున ఇళ్లు లేని పేదలతో డబుల్ బెడ్‌రూం లోకి వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. త్వరలోనే నిర్మాణాలు పూర్తవుతాయని అర్హులకే కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఇళ్లులేని నిరుపేద మహిళలు పాల్గొన్నారు.

ఉపాధి హామీపై కుట్రలకు నిదర్శనం

గజ్వేల్: ఉపాధి హామీ పథకంపై కేంద్రం అనుసరిస్తున్న కుట్రలకు ఆ పథకానికి తాజా బడ్జెట్‌లో కేటాయింపులే నిదర్శనమని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మండిపడ్డారు. బుధవారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ దేశంలోని కూలీలకు పనులు కల్పించేందుకు రూ.3లక్షల కోట్లు అవసరముండగా అందులో కోత విధించి పథకం ఎత్తివేయాలనే కుట్రలను స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. గత బడ్జెట్‌లో అరకొరగా రూ.60వేల కోట్లు కేటాయిస్తే నేడు మరింతగా దారుణంగా కేవలం రూ.35వేల కోట్లను మాత్రమే కేటాయించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని ఉల్లంఘిస్తూ పేదల హక్కులను కాలరాస్తున్న కేంద్రం తీరుపై ఉద్యమిస్తామని హెచ్చరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా


పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. బుధవారం ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్యం తాగి వాహనాలు నడుపుతూ సోమ, మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ లో 12 మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి 11 మందికి ఒక్కక్కరికి రూ.2 వేలు, మరో వ్యక్తికి రూ.3 వేల చొప్పున జరిమాన విధించినట్లు పోలీసులు తెలిపారు.

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు బుధవారం జరిమానా విధించింది. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో తొమ్మిది మంది నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన జడ్జి రమేశ్‌బాబు రూ.20,500 జరిమానా విధించారు.

కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేటఅర్బన్: కక్షతో తమను కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. బుధవారం వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామానికి చెందిన ఆలేటి కనకయ్య, ఆలేటి శివన్, ఆలేటి నాగరాజు రజక సంఘంలో సభ్యులుగా కొనసాగుతున్నారు. కాగా తమపై కొంత మంది కక్ష గట్టి సంఘం నుంచి వెలివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా కుల సంఘానికి సంబంధించిన చిట్టి లెక్కలు తమకు చూపడం లేదని ఆరోపించారు. అంతేకాకుండా ఏ శుభకార్యం జరిగినా తమను రానివ్వకుండా కొంతమంది అడ్డుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎక్కడ ఫిర్యాదు చేసినా, ఎవరికి చెప్పినా తమను కులంలోకి రానివ్వమని కొంతమంది బెదిరిస్తున్నారని బాధితులు వాపోయారు.

రెవెన్యూ అధికారులపై పోలీసులకు ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు తొంట మల్లయ్య కుటుంబ సభ్యులు

తూప్రాన్: తాను బతికుండగానే మరణించినట్లుగా ధృవీకరించి విలువైన భూమిని మరొకరి పేరుమీదు పట్టా చేసిన రెవెన్యూ అధికారులపై బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెంకటాయిపల్లి గ్రామస్తుడు తొంట మల్లయ్య బతికి ఉండగానే మరణించినట్లుగా ధ్రువీకరించి, అతడి భూమిని అధికారులు ఇతరులకు పట్టా చేసిన సంగతి పాఠకులకు తెలిసిందే. మల్లయ్య కొన్నాళ్లుగా బతుకు దెరువు కోసం నర్సింగ్ మండలంలోని సంకాపూర్‌లో కూలీ పనులు చేస్తున్నాడు. అతడికి వెంకటాయిపల్లిలో సర్వే నంబరు 135/4లో 0.550 గుంటలు, సర్వే నంబరు 177/ఇ/1లో 0.700 గుంటల లావాణి పట్టా భూములు ఉన్నాయి. మల్లయ్య గ్రామంలో లేకపోవడంతో ఇదే అదనుగా భావించిన వరుసకు అన్న తొంట యాదయ్య రెవెన్యూ అధికారులతో చేతులు కలిపాడు. మల్లయ్య మృతి చెందినట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించి మరొకరికి పట్టా చేశారు. ఇందుకు కారకులైన రెవెన్యూ అధికారులు, తొంట యాదయ్యపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు, ఆర్డీఓకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బావను చంపిన బావమరిది

అప్పు చెల్లించకపోవడంతో గొడవ


హత్యకు గురైన అబ్దుల్ అన్వర్

కేపీహెచ్‌బీకాలనీ: మద్యం మత్తులో సొంత బావను దారుణంగా హత్య చేసిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అప్పుగా తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వలేదనే కారణంతోనే అంతమొందించినట్లు బావిస్తున్నారు. కేపీహెచ్‌బీ సీఐ కిషన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం మన్యర్‌వాడికి చెందిన అబ్దుల్ అన్వర్ (27)కు 2019లో నగరంలోని మియాపూర్, హఫీజ్‌పేట్‌కి చెందిన ఫరీన్ బేగంతో వివాహం జరిగింది. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న అబ్దుల్ అన్వర్, అతడి బావమరిది సయ్యద్ అహ్మద్ స్నేహితుడైన మహమ్మద్ అకీల్ వద్ద ఆటో అద్దెకు తీసుకొని నడుపుతున్నాడు. కొద్ది రోజుల తరువాత అకీల్ నుంచి అన్వర్ కొంత అప్పు తీసుకున్నాడు. ఆటో అద్దె, తీసుకున్న అప్పు వడ్డీతో కలిపి రూ.1.45 లక్షలైంది. డబ్బులు తిరిగి చెల్లించాలంటూ అన్వర్‌ను తరచూ అకీల్‌ను అడుగుతున్నా చెల్లించడం లేదు. దాంతో అకీల్ అన్వర్ బావమరిదిపై ఒత్తిడి తెచ్చాడు. జనవరి 30వ తేదీన అన్వర్ బావమరిది సయ్యద్ అహ్మద్ కోహిర్ వెళ్లి ఒకరోజు అక్కడే ఉండి 31వ తేదీన అన్వర్‌ను తీసుకొని హైదరాబాద్ వచ్చాడు. అదే రోజు రాత్రి 8 గంటల నుంచి మద్యం తాగుతూ డబ్బు విషయంలో గొడవపడ్డారు. గొడవపెరగడంతో హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ సమీపంలో ముళ్లకత్వ చెరువు గట్టుపై అన్వర్‌ను అంతమొందించారు. బుధవారం మృతుడి సోదరుడు అబ్దుల్ సమద్‌కి అన్వర్ స్నేహితుడు ఫోన్‌చేశాడు. బావమరిది సయ్యద్ అహ్మద్ అతడి స్నేహితులు కేపీహెచ్‌బీ కాలనీ ముళ్లకత్వ చెరువు వద్ద హత్య చేశారని తెలిపాడు. ముళ్ళకత్వ చెరువు వద్ద గుర్తు తెలియని వ్యక్తి రక్తపు మడుగులో పడి ఉన్నాడని సమాచారం అందుకున్న పోలీసులు, సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు సమద్ తన సోదరుడిని అతడిఅత్త, బావమరిది, స్నేహితులు హత్య చేశారని పేర్కొన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

మియాపూర్ : గుర్తుతెలియని మహిళ మృతదేహం చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో లభ్యమైంది. లింగంపల్లిలోని నల్లగండ్ల ఫ్లైఓవర్ కింద గుర్తుతెలియని మహిళ(60) పడి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా ఆ మహిళ మృతి చెంది ఉంది. చుట్టుపక్కల ఆమె గురించి విచారించగా, యాచకురాలని స్థానికులు చెప్పారు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి..ఒకరి మృతి

మియాపూర్: ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఒడిశాకు చెందిన సారంగతమిశ్ర(50) భార్య మీనతీమిస్రా, కుమారుడుతో కలిసి చందానగర్‌లోని నివాసముంటున్నాడు. సారంగతమిస్రా మీర్‌పేట్‌లో జిరాక్స్ సెంటర్ నడుపుతున్నాడు. ఈ క్రమంలో సారంగతమిస్రా తన బైక్‌పై పనిముగించుకుని ఇంటికి వస్తుండగా మదీనాగూడలోని జాతీయ రహదారి వద్ద చందానగర్ వైపు వెళుతుండగా, అదుపు తప్పింది. దీంతో డివైడర్‌పై పడి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే దగ్గరలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.